సూర్య 18వ వసంతంలోకి.. www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

4PM www.suryaa.com
గురువారం
28 నవంబర్ 2024
పేజీలు: 02



## హైదరాబాద్‌లో తగ్గిన యాపిల్ ధరలు

గత ఏడాదితో పోలిస్తే హైదరాబాద్‌లో యాపిల్ ధరలు తగ్గాయి. 2023 డిసెంబర్‌లో మంచి నాణ్యత గల యాపిల్స్ ఒక్కోటి ₹35-₹40, సాధారణ రకం పండ్లు ఒక్కోటి ₹25కు లభించాయి. ఈ ఏడాది నవంబర్ నాటికి హై క్వాలిటీ యాపిల్స్ ఒక్కోటి ₹18, రెగ్యులర్ క్వాలిటీ పండ్లు ఒక్కోటి ₹10కే దొరుకుతున్నాయి. కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లో పంటలు బాగా పెరగడం, హైదరాబాద్ పండ్ల మార్కెట్‌లకు సరఫరా పెరగడంతో ధరలు తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

# రోటి కపడా రొమాన్స్ రివ్యూ

ప్రతి మగాడి జీవితంలోకి ఏదో సందర్భంలో ఆడది అడుగుపెడుతూనే ఉంటుంది. వస్తూ వస్తూ ఎక్కడలేని ఆనందాన్ని.. అనుభూతుల్ని.. సంతోషాన్ని ఇస్తుంది. వెళ్లేటప్పుడు ఏడిపించి పోతుంది. తను నీకు ఇచ్చిన వాటిలో నువ్వేం గుర్తు పెట్టుకున్నావన్నదే ఇంపార్టెంట్. తను ఇచ్చిన మధుర క్షణాలను గుర్తు పెట్టుకుని ముందుకు వెళ్లిపోతావా? లేదంటే ఏడిపించిన క్షణాలను గుర్తు పెట్టుకుని ఆగిపోతావా? జీవితం అనేది సముద్రం లాంటిది. ఇక్కడన్నీ సిచ్యువేషన్స్ మాత్రమే ఉంటాయి.. ఇది రైటూ ఇది రాంగూ అనేదేం ఉండదు. కాబట్టి ఎక్కువ ఆలోచించకుండా మూసుకుని ముందుకు వెళ్లిపోవడమే జీవితం.. ఆ జీవితాన్ని యూత్‌కి ఎలా చెప్తే అర్థం అవుతుందో.. ఎలా ఎక్కిస్తే ఇట్టే ఎక్కేస్తుందో చూపించే చిత్రమే 'రోటి కపడా రొమాన్స్'.



విక్కీ (సుప్రజ్ రంగా), హర్ష (హర్ష నర్రా), రాహుల్ (సందీప్ సరోజ్), సూర్య (తరుణ్ పొనుగోటి) నలుగురు స్నేహితులు. రాహుల్ సాఫ్ట్ వేర్.. సూర్య ఫేమస్ ఆర్జే.. హర్ష క్రియేటివ్ ఫీల్డ్.. వీక్కీ (టీటీపీ-తినడం తిరగడం పడుకోవడం). ఇలా వాళ్ల వాళ్ల పనుల్లో .. లైఫ్‌ని చిల్‌గా ఎంజాయ్ చేస్తుంటారు. వాళ్ల జీవితాల్లోకి సోనియా (ఖుష్బూ చౌదరి), శ్వేతా (మేఘా లేఖా), దివ్య (నువేక్ష), ప్రియా (సోనూ ఠాకూర్) వస్తారు.

సోనియా-హర్ష, ప్రియ-రాహుల్, శ్వేత- విక్కీ, దివ్య- సూర్య.. ఈ ఎనిమిది మంది నాలుగు జంటలుగా మారి ప్రేమలో పడతారు. అయితే ఆ నలుగురు ఈ నలుగురి జీవితంలోకి వచ్చిన తరువాత అసలు సినిమా మొదలౌతుంది. అందరి ప్రేమకథల్లో ఉన్నట్టే.. కన్ఫ్యూజన్స్, మిస్ అండర్‌స్టాండింగ్స్, వన్ సైడ్ డిసిషన్స్ వల్ల ఈ నాలుగు జంటల ప్రేమకథలు అటకెక్కుతాయి. బ్రేకప్ చెప్పేసుకుంటారు. అలా విడిపోయిన ఈ నాలుగు జంటలు లైఫ్‌లో ఏవిధంగా రియలైజ్ అయ్యారనేదే ఈ సినిమా కథ. ప్రేమ అనేది ఎవరి జీవితంలో ఉండదు? ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఉండే ఉంటుంది. ఆ ప్రేమలో ఉన్న మధుర క్షణాలను గుర్తుపెట్టుకుని ముందుకు వెళ్లిపోయే వారు కొందరైతే.. ఆ ఊహల్లో నుంచి బయటకు రాలేక ఏడ్చేవాళ్లు మరికొందరు. ప్రేమ పేరుతో మోసం చేసిందని పగ, ప్రతీకారాలు పెంచుకునే వాళ్లు ఇంకొందరు. అయితే మన సమస్యను మన వైపు నుంచి చూస్తే పెద్దగా మరింత బాధగా అనిపిస్తుంటుంది. కానీ ఎందుకు అలా చేయాల్సివచ్చిందని అవతల వాళ్ల వైపు నిలబడి చేస్తేనే ఎవరి బాధ ఎంతో తెలిసేది. రియలైజేషన్ వచ్చేది. 'రోటి కపడా రొమాన్స్' చిత్రంలో అదే చూపించారు. ఒకర్నొకరు చూడ్డం.. ఇష్టపడటం.. ప్రేమించుకోవడం.. ఆ తరువాత మనస్పర్థలతో విడిపోవడం. అన్ని ప్రేమకథల్లో ఇవన్నీ రొటీన్. కానీ.. అడిగి చూడు అన్ని ప్రేమకథలు ఒకటిగా ఉండవు. చెప్పే విధానాన్ని బట్టే ఆ ప్రేమకథలో ఉన్న సోల్ ఏంటనేది తెలుస్తుంది. 'రోటి కపడా రొమాన్స్'తో పాత కథనే కొత్త కోణంలో యూత్‌కి కనెక్ట్ చేశారు దర్శకుడు విక్రమ్ రెడ్డి. ముఖ్యంగా ఈ మూవీ స్క్రీన్ ప్లే మేజర్ హైలైట్. కథను ప్రారంభించిన తీరు.. ముందుకు తీసుకుని వెళ్లిన విధానంతో దర్శకుడు మంచి కథకుడే అనిపించారు. ఎక్కడా బోరింగ్ లేకుండా కథని ముందుకు తీసుకుని వెళ్లారు. నాలుగు ప్రేమకథలు అంటే.. కథలో కాస్త కన్ఫ్యూజన్ ఉండొచ్చు. కానీ.. ఎక్కడా అలాంటి కన్ఫ్యూజన్ లేకుండా ఫుల్ క్లారిటీతో కథను నడిపించారు.దర్శకుడిగా బెస్ట్ కెరీర్‌ని ఊహించుకునే ఇండస్ట్రీకి వచ్చానని చెప్పిన దర్శకుడు విక్రమ్ రెడ్డి.. 'రోటి కపడా రొమాన్స్'తో తొలి అడుగు గట్టిగానే పడింది. మంచి కథకుడు అనిపించాడు. ఈ సినిమా చూసి ఒక్కరైనా బాలేదంటే.. సినిమాలకు రిటైర్‌మెంట్ ఇచ్చేస్తానని స్టేట్‌మెంట్ ఇచ్చిన దర్శకుడికి ఆ అవసరం పడదు గాక పడదు. ఇంకా బావుంటే బావుండు అని అనొచ్చేమో కానీ.. బాలేదనే మాట అయితే రాకపోవచ్చు. సినిమా బాగుందని అనిపించుకోవాలంటే అన్నీ సమపాళ్లలో కుదరాలి. ఈ సినిమాకి నటీనటుల ఎంపిక, కథ, కథనం డైరెక్షన్‌తో పాటు.. కథలోని మూడ్‌ను క్యారీ చేయడంలో సంగీతం, సినిమాటోగ్రఫీ బాగా హెల్ప్ అయ్యాయి. ముఖ్యంగా పాటలు అయితే.. ఏదో రన్ టైమ్ కోసం.. రొమాన్స్ కోసం అన్నట్టుగా కాకుండా.. కథలో భాగంగానే వస్తుంటాయి. పాటల్లో కూడా కథ కంటిన్యూ అవుతుండటం రేర్‌గా చూస్తుంటాం. 'రోటి కపడా రొమాన్స్'లో అలాంటి రేర్ ఫీట్ కనిపించింది. లవ్, ఎమోషన్స్, రొమాన్స్ ఇలా ఏ సీన్ చూసుకున్నా బ్యాగ్రౌండ్ మ్యూజిక్‌తో బాగా ఎలివేట్ చేశారు. సన్నీ ఎంఆర్, హర్షవర్ధన్ రామేశ్వర్, ఆర్ఆర్ ధృవన్ త్రయానికి మ్యూజిక్ పరంగా మంచి మార్కులు పడతాయి. సంతోష్ రెడ్డి సినిమాటోగ్రఫీ బాగుంది.



## టీచర్ల సెలవులపై ఆంక్షలు.. ఎత్తేయాలని డిమాండ్

ఓ స్కూల్ లేదా మండలంలోని మొత్తం స్టాఫ్‌లో గరిష్ఠంగా 7-10 శాతం మంది టీచర్లు మాత్రమే సెలవులు వాడుకోవాలని విద్యాశాఖ షరతులు విధించింది. దీనిపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం మండిపడింది. టీచర్లు అత్యవసర, ఆరోగ్య కారణాలతో తమ సాధారణ సెలవులను వినియోగించుకోవడంపై ఆంక్షలు తగవని పేర్కొంది. లీవ్స్‌పై పరిమితిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తోంది.

## ప్రియురాలిని చంపి 50 ముక్కలు చేసి..

ఝార్ఖండ్‌కు చెందిన నరేశ్ చెన్నైలో ఓ యువతితో సహజీవనం చేస్తూ సొంతూరు వెళ్లి మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. తనను పెళ్లి చేసుకుని, ఇంటికి తీసుకెళ్లాలంటూ ప్రియురాలు ఒత్తిడి తేవడంతో ఆమెను హత్య చేశాడు. పదునైన ఆయుధాలతో శరీరాన్ని 50 ముక్కలు చేసి అడవిలో పారేసి పరారయ్యాడు. ఓ కుక్క యువతి శరీర భాగంతో తిరగడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. నిందితుడు చికెన్ షాపులో పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.



## భారీగా పెరగనున్న పసిడి, చమురు ధరలు

అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం, ముడి చమురు ధరలు వచ్చే ఏడాది ఆఖరుకల్లా భారీగా పెరగవచ్చని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ క్రమంలోనే ఔన్స్ పసిడి విలువ 2025 డిసెంబర్ నాటికి ఏకంగా 3,150 డాలర్లను తాకవచ్చని చెప్తున్నది. ఇది ప్రస్తుతంతో పోల్చితే 19 శాతం ఎక్కువ కావడం గమనార్హం. గ్లోబల్ మార్కెట్‌లో ఇప్పుడు ఔన్స్ 2,550 డాలర్ల వద్ద ఉన్నది. కాగా, అంచనా నిజమైతే భారతీయ మార్కెట్లో తులం బంగారం లక్ష దాటేయడం ఖాయం. ఇక బ్యారెల్ క్రూడాయిల్ రేటు 100 డాలర్లకు చేరవచ్చని అంటున్నది. ఇప్పుడిది 70 డాలర్లలో ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా నెలకొనే ప్రతికూల పరిస్థితులు.. ఓవైపు మదుపరులను, మరోవైపు డిమాండ్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సురక్షిత మదుపు సాధనమైన బంగారంతోనే తమ పెట్టుబడులకు రక్షణ అని మెజారిటీ ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. అందుకే ద్రవ్యోల్బణం పెరుగుతున్నా, స్టాక్ మార్కెట్లు పతనమవుతున్నా, యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నా, అధికారాలు మారి వ్యాపార-వాణిజ్య పరిస్థితులు దిగజారినా..




వెంటనే పెట్టుబడులను గోల్డ్ వైపునకు మళ్లిస్తున్నారు. వచ్చే ఏడాదిలో ఇలాంటి ఘటనలకు ఎక్కువగానే ఆస్కారముందని, పుత్తడి ధరలు ఆల్‌టైమ్ హైల్లోకి చేరడం ఖాయమన్న అభిప్రాయాలు గట్టిగా వ్యక్తమవుతున్నాయిప్పుడు. ఇక పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తతలు క్రూడాయిల్ ధరల్ని సహజంగానే ఎగదోస్తాయి. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఇబ్బందికర వాతావరణం తప్పక ముడి చమురును ఖరీదెక్కిస్తుందని అంటున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, దీనిపై ఐరోపా దేశాల వైఖరి, డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో అమెరికా తీసుకునే నిర్ణయాలు, చైనాతో సుంకాల పోరు ఇలా అనేకాంశాలతో క్రూడ్ సెంచరీ కొడుతుందన్న అంచనాలు పుష్కలంగా వస్తున్నాయి.

## హాట్ లుక్‌లో మెహరీన్

టాలీవుడ్‌లో పూర్వ వైభవం కోసం ఎదురుచూస్తోంది మెహరీన్. ఒకప్పుడు బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్‌లను అందుకొన్ని లక్కీ స్టార్‌గా పేరుతెచ్చుకున్న ఈ బ్యూటీ తెలుగు స్క్రీన్‌పై కనిపించి ఏడాది దాటిపోయింది. పరాజయాల కారణంగా కొన్నాళ్లుగా మెహరీన్‌కు సరైన అవకాశాలు రావడం లేదు. నాని హీరోగా నటించిన కృష్ణ గాడి వీర ప్రేమకథ మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది మెహరీన్. సినిమాలకు దూరమైన సోషల్ మీడియాలో మాత్రం బోల్డ్ ఫొటోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది మెహరీన్. హిందీలో సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ అనే వెబ్ సిరీస్ చేసింది మెహరీన్.

తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టిన ప్రియాంక గాంధీ..

## వయనాడ్ ఎంపీగా ప్రమాణం



కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాంకా గాంధీ వయనాడ్ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా ప్రియాంక తన తల్లి, రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ, సోదరుడు, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కలిసి పార్లమెంట్‌కు చేరుకున్నారు. లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ఆమెతో ప్రమాణం చేయించారు. పోడియం వద్దకు వెళ్లిన ప్రియాంక.. ముందుగా తమ చేతిలో ఉన్న రాజ్యాంగ ప్రతిని చూపించిన తర్వాతే ప్రమాణ స్వీకారం చేశారు.తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టిన ప్రియాంక.. చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సోనియా, రాహుల్‌తోపాటు.. ప్రియాంక పిల్లలు రైహాన్ వాద్రా, మిరయా వాద్రా కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా తన తల్లికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇంతకాలం పార్టీ ప్రచారాలకే పరిమితమైన ప్రియాంక గాంధీ తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. తన సోదరుడు రాహుల్ రాజీనామాతో ఖాళీ అయిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో పోటీ చేసి రికార్డు మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. శనివారం వెలువడిన ఫలితాల్లో ఆమె 4.8 లక్షల ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 3.64 ఓట్లతో ఉన్న రాహుల్ పేరుతో ఉన అత్యధిక మెజార్టీ రికార్డును ఆమె తుడిచివేశారు.





EVENING EDITION
గురువారం | 28 నవంబర్ 2024 4PM
www.suryaa.com
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# వికటకవి రివ్యూ

డిటెక్టివ్ కథలు ఎప్పుడూ ఓ ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేస్తూనే ఉంటాయి. ఈ క్రమంలో తెలంగాణ బ్యాక్ డ్రాప్‌ను ఎంచుకుని డిటెక్టివ్ రామకృష్ణ అనే పాత్రతో చేసిన ఈ వికటకవి వెబ్ సిరీస్ ఆడియెన్స్‌ను ఏ మేరకు ఆకట్టుకుంది? అసలు వికటకవి కథ, కథనాలు ఏంటి? దర్శకుడిగా ప్రదీప్ మద్దాలి ఆడియెన్స్‌ను ఏ మేరకు ఎంగేజ్ చేశాడు? నరేష్ అగస్త్య, మేఘా ఆకాష్‌లు ఆడియెన్స్‌ను మెప్పించారా? లేదా? అన్నది చూద్దాం. అమరగిరి సంస్థానంలోని దేవతలగుట్టకి అక్కడి దేవత శాపం ఇచ్చిందని అక్కడి ప్రజలు నమ్ముతారు. అక్కడికి వెళ్లిన వారందరికీ అంతు పట్టని విధంగా ఏదో జరుగుతూ ఉంటుంది. అప్పటికే అక్కడకు వెళ్లిన 32 మంది వింత మనుషుల్లా తయారవుతారు. అలా ఆ అమరగిరి సంస్థానం రాజు దేవరాజుల రాజా నరసింహారావు (శిజు మీనన్) తన ప్రజల కోసం చింతిస్తూ ఉంటాడు. ఆ రాజు అల్లుడు ఎమ్మెల్యే రఘుపతి (రఘు కుంచె) అక్కడి అన్ని విషయాలు చూసుకుంటూ ఉంటాడు. డిటెక్టివ్ రామకృష్ణ (నరేష్ అగస్త్య) తన తల్లి గౌరి (రమ్య దుర్గకృష్ణ)కి ఆపరేషన్ చేయించాలని చూస్తుంటాడు. ఆ టైంలోనే అమరగిరికి ఉన్న సమస్యను తెలుసుకుంటాడు. ఆ సమస్యను పరిష్కరించి.. రాజు నుంచి డబ్బు తీసుకుని.. తన తల్లికి ఆపరేషన్ చేయించాలని అనుకుంటాడు. ఈ క్రమంలోనే హైదరాబాద్ నుంచి అక్కడికి వెళ్లిన రామకృష్ణకి రఘుపతి కూతురు లక్ష్మి (మేఘా ఆకాష్) పరిచయం అవుతుంది. రామకృష్ణకి అమరగిరిలో ఎదురైన పరిస్థితులు ఏంటి? అసలు ఆ దేవతల గుట్ట మీద ఏం జరిగింది? దేవత నిజంగానే శాపం ఇచ్చిందా? రాజా కొడుకు మహదేవ్ (తారక్ పొన్నప్ప) ఫ్లాష్ బ్యాక్ ఏంటి? ఈ కథలో ఆజాం ఖాన్ (ముక్తర్ ఖాన్) ప్రాధాన్యత ఏంటి? అన్నది కథ. వికటకవి కథ చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తుంది. రాసుకున్న పాయింట్, దానికి అల్లుకున్న బ్యాక్ డ్రాప్.. తీసుకున్న లేయర్లు చాలా ఇంట్రెస్టింగ్‌గా




అనిపిస్తుంది. సాయి తేజ్ రాసుకున్న కథకు.. ప్రదీప్ మద్దాలి తన విజన్‌ను తోడు చేశాడు. వికటకవి ఆరంభమే చాలా ఇంట్రెస్టింగ్‌గా స్టార్ట్ అవుతుంది. ఉన్న ఆరు ఎపిసోడ్స్ చాలా ఆసక్తికరంగా సాగుతాయి. ఒక ఎపిసోడ్ చూసి ఆపేద్దామనుకునే టైపులో ఉండదు. ప్రతీ ఎపిసోడ్ ముగింపు ఉత్కంఠగా ఉంటుంది. కచ్చితంగా తరువాతి ఎపిసోడ్ చూసేయాల్సిందే అన్నట్టుగా సాగుతుంది. అయితే మధ్య మధ్యలో కాస్త సాగదీసినట్టుగా, స్లోగా, బోరింగ్‌గా కూడా అనిపిస్తుంది. కానీ ముందుకు వెళ్తున్న కొద్దీ కొత్త కొత్త విషయాలు బయటకు వస్తుంటాయి. అసలు పాయింట్ అన్నది ఆరో ఎపిసోడ్‌లో పూర్తిగా రివీల్ అవుతుంది. దేవతల గుట్ట రహస్యం, మహదేవ్ ప్రయోగాలు ఇలా అన్నీ అద్భుతంగా అనిపిస్తాయి. కథ అంతా కూడా 1940, 1970 ప్రాంతంలో జరుగుతుంది. అప్పటి పరిస్థితుల్ని చక్కగా చూపించారు. రజాకార్ల ప్రస్థావన, సర్దార్ వల్లభభాయ్ పటేల్ దేశ ఏకీకరణ కోసం చేసిన ప్రయత్నాల గురించి అక్కడక్కడా ప్రస్థావించారు. ఈ మొదటి సీజన్‌లో ప్రస్థావించిన మేఘ మథనం, ఆపరేషన్ వరుణ ఇలాంటి టాపిక్స్ అన్నీ చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తుంటాయి. ఇంకా ఎక్కువగా చెబితే చూసే వారి థ్రిల్ మిస్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. మంచి స్క్రీన్ ప్లే, చిక్కుముళ్లు, వాటిని సరైన టైంకి సరైన ప్లేస్‌లో విప్పే తీరు బాగుంటుంది. ప్రతీ ఒక్క చిన్న సీన్, ప్రతీ చిన్న డీటైలింగ్‌ను చాలా చక్కగా చూపించాడు దర్శకుడు. కొన్ని లాజిక్స్‌ను పక్కన పెడితే.. వికటకవి ఆద్యంతం గ్రిప్పింగ్‌గా, థ్రిల్లింగ్‌గా ఎంగేజ్ చేసేలా ఉంటుంది. రెండో సీజన్‌కి కూడా మంచి లైన్‌ను పెట్టేసుకున్నారు. చూస్తుంటే సెకండ్ సీజన్‌ను మరో లెవెల్లో ప్లాన్ చేసినట్టుగా కనిపిస్తోంది.




## పేలిన రియాక్టర్.. సంగారెడ్డిలో
# భారీ అగ్నిప్రమాదం

సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. జిల్లాలోని జిన్నారం మండలం కాజీపల్లి పారిశ్రామికవాడలోని అరోరా లైఫ్‌సైన్స్ పరిశ్రమలో గురువారం ఉదయం మంటలు చెలరేగాయి. ఎంబీ-2 బ్లాక్‌లోని రియాక్టర్లలో సాల్వెంట్ మిక్సింగ్ జరుగుతుండగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో కార్మికులు భయంతో బయటకు పరుగులు పెట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అందుపులోకి తీసుకొచ్చారు. రియాక్టర్ పేలుడుతో ఇండస్ట్రియల్ పార్కు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. హైదరాబాద్ జీడిమెట్ల ఎస్ఎస్‌వీ ఫ్యాబ్ ఇండస్ట్రీస్ పాలిథిన్ సంచుల తయారీ కంపెనీలో మంగళవారం భారీ ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. పరిశ్రమలో చెలరేగిన మంటలను అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి అర్ధరాత్రి వరకు అదుపులోకి తీసుకువచ్చారు. కంపెనీలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. భవనంలోని మూడో అంతస్తులో మంటలు చేరగా.. క్రమంగా ఒకటో అంతస్తు వరకు మంటలు అంటుకున్నాయి. ఆ తర్వాత భవనం మొత్తం మంటలు చెలరేగాయి. మంటల సమయంలో ఫ్యాక్టరీలోని కెమికల్ డ్రమ్ములు పెద్ద ఎత్తున నిల్వ ఉన్నట్లు సమాచారం. ఈ సమయంలో ఆ డమ్ములన్నీ పేలడంతో మంటలు మరింత చెలరేగాయి. ఫలితంగా మంటలను ఆర్పివేయడం అగ్నిమాపక సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. భారీగా చెలరేగిన మంటలతో ఆ ప్రాంతమంతా భారీగా పొగ కమ్మేసింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి నగరంలోని పలుచోట్ల నుంచి ఏడు ఫైరింజన్లను తరలించారు. అలాగే, వాటర్ బోర్డుతో పాటు ప్రైవేటు ట్యాంకర్లతో నీటిని తరలించారు. ఒక దశలో మంటలు వంద మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడ్డాయి. దాంతో పాటు 200 మీటర్ల వరకు వేడిసెగలు వచ్చాయి. రసాయన డ్రమ్ముల పేలుడుతో మంటలు భారీగా ఎగిసిపడగా.. మంటలను అదుపులోకి తేవడం అగ్నిమాపక సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. మంటల ధాటికి భవనం గోడలు బీటలు వారి కూలిపోయింది. ప్రమాదంలో దాదాపు రూ.100కోట్లకుపైగా నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. ప్రమాదం జరిగిన సమయంలో కంపెనీలు వంద మందికిపైగా కార్మికులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం నేపథ్యంలో కార్మికులంతా బయటకు వెళ్లిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది.



# మళ్లీ కొండెక్కిన కూరగాయలు

కార్తీక మాసం మరికొన్ని రోజుల్లో ముగియనుంది. అయినా బహిరంగ మార్కెట్లలో కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. సాధారణంగా కార్తీక మాసంలో మాంసాహారానికి చాలా మంది దూరంగా ఉంటారు. దీంతో ఈ నెల మొత్తం శాఖాహారమే తీసుకుంటారు. దీంతో ప్రతీయేట ఈ మాసంలో చికెన్, మటన్ ధరలు తగ్గుతుంటాయి. ఇక ఈసారి కూడా చికెన్ ధర రూ.180కి చేరింది. అయితే కూరగాయల ధరలు మాత్రం అనూహ్యంగా పెరిగాయి. ఏకంగా మాంసాహారానికి చేరువలో కాయగూరలు, ఆకుకూరల రేట్లు తిష్టవేశాయి. స్థానికంగా ఉద్యాన పంటలు సాగవుతున్నా ధరలు మాత్రం మండిపోతున్నాయి. అధిక ధరల కారణంగా సామాన్యులు విలవిల్లాడుతున్నారు. ఇంతటి ధరలు మునుపెన్నడూ చూడలేదంటూ పెదవివిరుస్తున్నారు. కార్తీక మాసంలో ఎక్కువ శాతం మంది భక్తులు వివిధ దేవుళ్ల మాలలు ధరించడం, వారు పూర్తిగా శాఖాహారానికే పరిమితం కావడం, వారి కుటుంబాలు కూడా దాదాపు 30 నుంచి 40 రోజులపాటు శాఖాహారమే తీసుకోవడం కారణంగా వ్యాపారులు కూరగాయల ధరలు అమాంతం పెంచేశారు. ముఖ్యంగా భద్రాద్రి జిల్లాలో కూరగాయల ధరలు అమాంతంగా పెరిగాయి. ఇక్కడ నీటి వనరులున్న అధికంగా ఉండటంతో కూరగాయలు, ఆకుకూరల సాగు గణనీయంగా జరుగుతోంది. అయినా ప్రజల వినియోగానికి ఇవి సరిపోవడం లేదు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. మరోవైపు ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంట దిగుబడి తగ్గిందని, అందువల్లనే ధరలు ఒక్కసారిగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. అయితే కొందరు వ్యాపారులు మాత్రం లాభాల కోసం డిమాండ్‌ను బట్టి ధరలను పెంచుతున్నారు. ముఖ్యంగా కేజీ చిక్కుడు కాయల ధర రూ.100కుపైగా పలుకుతోంది. కేజీ టమాటా రూ.50 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. రూ.10కి విక్రయించే చిన్న సొరకాయ ఏకంగా రూ.50కి చేరింది. ఇక ఆకుకూరల ధరలైతే చుక్కలకు చేరాయి. రూ.20కి చిన్నవి మూడు కట్టలు మాత్రమే ఇస్తున్నారు. 3 నిమ్మకాలు రూ.20, ఉల్లి కేజీ రూ.60.. ఇలా అన్ని కూరగాయల ధరలు పెరిగిపోయాయి. కూరగాయల ధరలు ఇంతలా పెరగడం ఎప్పుడూ చూడలేదని వినియోగదారులు వాపోతున్నారు. ఈ ధరలు చూస్తే కొనే పరిస్థితి, తినే పరిస్థితి కన్పించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఒక్క భద్రాద్రి జిల్లాలోనే కాదు తెలుగు రాష్ట్రాల్లో చాలా చోట్ల కూరగాయల ధరలు ఇదే మాదిరి ఉన్నాయి.



# హాట్ బ్యూటీ అషు రెడ్డి

బిగ్ బాస్ గేమ్ షో ద్వారా చాలా మంది పాపులారిటీ సొంతం చేసుకున్న భామల్లో అషు రెడ్డి ఒకరు. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తన అందంతో ఎంతో మంది కుర్రాళ్ళ గుండెల్లో బాణాలు గుచ్చింది ఈ చిన్నది. ముఖ్యంగా అర్జీవితో బోల్డ్ ఇంటర్వ్యూ చేసి పాపులర్ అయ్యింది అషు రెడ్డి. బిగ్ బాస్ తర్వాత పలు షోలు, ఈవెంట్లు చేస్తూ.. తెగ సందడి చేస్తున్న ఈ మధ్య గ్లామర్ ను మరింతగా పెంచేసింది. సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ కుర్రాళ్లను కవ్విస్తుంది అషు రెడ్డి. సోషల్ మీడియాలో గ్లామరస్ వీడియో పోస్ట్ చేస్తూ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. బిగ్ బాస్ కంటే ముందు కొన్ని సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసింది ఈ చిన్నది. అలాగే టిక్ టాక్ వీడియోలు చేస్తూ అందరిని ఆకట్టుకుంది. అప్పట్లో ఈ అమ్మడిని జూనియర్ సమంత అని పిలిచేవారు. కానీ అనుకున్నంత గుర్తింపు రాలేదు. బిగ్ బాస్ తర్వాత అయినా సినిమాలతో బిజీ అవుతుందేమో అనుకున్నారు కానీ అలా కూడా జరగలేదు.

## నేటి నుంచి 'రైతు పండుగ'

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావొస్తున్న నేపథ్యంలో నేటి నుంచి మూడు రోజుల పాటు మహబూబ్‌నగర్‌లో 'రైతు పండుగ' నిర్వహించనుంది. దీనిలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, లాభసాటి విధానాలు, వివిధ పంట ఉత్పత్తులపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ మేరకు 150 స్టాళ్లను ఏర్పాటు చేయనుండగా వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరుకానున్నారు. ఈ నెల 30న సీఎం రేవంత్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

## వచ్చే నెలాఖరు నాటికి బీజేపీ కొత్త చీఫ్: కిషన్ రెడ్డి

డిసెంబర్ చివరి నాటికి తెలంగాణ బీజేపీ కొత్త చీఫ్‌ను ఎన్నుకుంటామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. మోదీతో రాష్ట్ర నేతల సమావేశం తర్వాత ఆయన మాట్లాడారు. పార్టీ నేతలంతా కలిసి పనిచేయాలని ప్రధాని సూచించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విపక్షాలను తిట్టడం ఆపేసి పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్ రెడ్డి ఉన్న సంగతి తెలిసిందే.

## బాధ్యతలు చేపట్టిన స్మితా సభర్వాల్

సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ రాష్ట్ర యువజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 12న ఆమెకు ఈ పోస్టింగ్ కల్పించారు. కానీ మహారాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్‌గా ఇప్పటివరకు స్మిత అక్కడే ఉన్నారు. అక్కడి నుంచి తిరిగి వచ్చిన వెంటనే బాధ్యతలు చేపట్టారు.

## పెళ్లికి ఫేక్ జువెల్లరీ గిఫ్ట్.. విచారణకు ఆదేశం

యూపీలో వెనుకబడిన అమ్మాయిల పెళ్లిళ్ల కోసం అమలు చేస్తోన్న మాస్ మ్యారేజెస్ స్కీమ్‌లో రోజుకో కొత్త అవినీతి వెలుగుచూస్తోంది. ఇన్ని రోజులు ఫేక్ పెళ్లిళ్లు బయటపడగా తాజాగా ఫేక్ గిఫ్టుల తతంగం చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా పెళ్లి చేసుకున్న జంటకు కానుకలు ఇవ్వాల్సిన ప్రభుత్వ అధికారులు నకిలీ బంగారు ఆభరణాలు, నాణ్యతలేని కానుకలు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి.